రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

హైదర్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ వీజేఆర్‌నగర్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన హామీలు నేరవేరుస్తున్న కాంగ్రెస్‌కు ఓట్లువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

● ఆల్విన్‌కాలనీలో కార్పొరేటర్ ప్రచారం

మియాపూర్: హఫీజ్‌పేట డివిజన్ ఆల్విన్‌కాలనీలో కార్పొరేటర్ పూజిత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఆప్యాయంగా పలుకరిస్తూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి రంజిత్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

● చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని గెలిపించండి

ఎల్బీనగర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు మరింతగా కృషి చేయాలని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్-1, 2లో గడపగడపకు పాదయాత్ర చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డితో కలిసి దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందాలంటే రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్ నేత, పిట్ట హరినాథ్‌రెడ్డి, నిజాముద్దీన్, రమేష్‌నేత, యాదవరెడ్డి, లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

● రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి

చేవెళ్ల: ఎంపీ రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల పరిధిలోని చన్వవల్లి, ఇక్కారెడ్డిగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పెంటయ్యగౌడ్, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, జంగారెడ్డి, భీమయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గోపాల్ యాదవ్, నాయకులు ఏ.రవీందర్‌రెడ్డి, రాజు, జనార్దన్, తదితరులు ఉన్నారు.

పథకాల అమలుకు కాంగ్రెస్‌ను గెలిపించాలి

కందుకూరు: సంక్షేమ పథకాలు అమలుకు కాంగ్రెస్‌ను గెలిపించాలని.. ఐదు ఏళ్లలో చేవెళ్ల ప్రజలకు సేవ అందించానని, ఈ ఎన్నికల్లో తనకు మరో సారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని సరాస్వతిగూడ, లేమూరు. తిమ్మాపురం, రాచులూరు, గూడూరు, పులిమామిడి, నేదునూరు గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనీతారెడ్డిలతో పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డి మాట్లాడారు.సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కూడ కాకుండానే ప్రతిపక్షాల నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తనకు చేవెళ్ల పార్లమెంట్ ప్రజల సమస్యలు క్షున్నంగా తెలుసని ఈ ఎన్నికల్లో మరోసారి అవకాశం ఇస్తే సమస్యలను పూర్తిస్థాయిలో అమలు చేస్తాని హామీ ఇచ్చారు.


హఫీజ్‌పేట ఆల్విన్‌కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పూజిత


ఆర్కేపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అధికారంలో ఉన్నా.. ప్రజల కోసం కొట్లాడిన

ఐటీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్న నాయకులు పాలక పక్షంపై కొట్లాడడం రాజకీయాల్లో సహజంగా జరిగే పరిణామాలేనని, తాను మాత్రం అధికార పార్టీలో మంత్రిగా ఉండి కూడా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కొట్లాడిన వ్యక్తినని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కూకట్‌పల్లిలోని పీఎన్ఎం హైస్కూల్ ఆవరణంలో శనివారం ఐటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తాను ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో జీతం పెంపుతో పాటు పలు సమస్యలపై మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగారని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించాలని, అప్పటి సీఎం కేసీఆర్‌ను కోరితే ఒక్క సంతకంతో 1700 మంది కార్మికులను తొలగించారని ఈటల తెలిపారు. మున్సిపల్ కార్మికులకే కాకుండా ఆశా వర్కర్స్ గ్రామకార్యదర్శులు, ఆర్టీసీ సంఘాలకు కూడా తాను మద్దతుగా నిలబడ్డానని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. పదవుల కోసం ఏనాడూ పెదవులు మూసుకొనే విధానం తనది కాదన్నారు. కూకట్‌పల్లిలోని మైత్రినగర్, సాయినగర్ ప్రాంతాలకు చెందిన పలువురు స్థానికులు బీజేపీ జిల్లా కో కన్వీనర్ యంజాల పద్మయ్య ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈటల నవనీత్, సంతోష్, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, శ్రీకర్‌రావు, యంజాల పద్మయ్య పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో ప్రచారం

కేపీహెచ్‌బీకాలనీ: పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓటర్లను కోరారు. ఈ మేరకు శనివారం కేపీహెచ్‌బీలోని ఇందూ, మంజీరా, ఎన్ఎస్ఎల్, లోధా నివాసితులతో సమావేశమై నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కేసీఆర్ కుటుంబపాలనపై కోపంతో కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.


ఐటీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్


నమస్కరిస్తున్న ఈటల రాజేందర్

మల్కాజిగిరిలో వాళిద్దరూ కాదు.. నేనే లోకల్!

మల్లాపూర్: మల్కాజిగిరి ప్రజలను మోసం చేసేందుకు ఇద్దరు అభ్యర్థులు లోకల్‌పేరుతో తిరుగుతున్నారని.. అసలైన లోకల్ తానేనంటూ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మల్లాపూర్ డివిజన్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్ షో, బహిరంగ సభలో ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో హిందువులపై విమర్శలు చేస్తే ప్రతిఫలం చూశారన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రంలో ఇచ్చిన హామీలు మరిచిపోవాల్సిందేనని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, శిల్పారెడ్డి, తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డివి బూటకపు వాగ్దానాలు

జవహర్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలో బూటకపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్ అయినా మంజూరు చేశారా.. కల్యాణలక్ష్మి పథకంలో లక్షా పదహారువేలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఒక్కరికైనా బంగారం ఇచ్చారా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. జవహర్‌నగర్‌లో శుక్రవారం రాత్రి ఫైరింగ్‌కట్ట నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అబద్దాల సీఎం మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

తనిఖీల్లో రూ.24 లక్షలు స్వాధీనం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించకుండా, ఎటువంటి క్యూఆర్ కోడ్ లేకుండానే నగదు తరలిస్తున్న వాహనాలను శనివారం రాత్రి ఎస్‌వోటీ పోలీసుల తనిఖీల్లో చేసి రూ.24 లక్షల నగదు స్వాధీనం చేసుకొన్నారు. కూకట్‌పల్లి, పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని ఎల్లమ్మబండ, పేట్‌బషీరాబాద్‌లోని మ్యాక్స్ షాపింగ్‌మాల్ ప్రాంతాల్లో బాలానగర్ ఎస్‌వోటీ, స్థానిక పోలీసు సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఎల్లమ్మబండతోపాటు పేట్‌బషీరాబాద్ పరిధిలో చేసిన తనిఖీల్లో భాగంగా సెక్యూర్ వ్యాల్యూ కంపెనీ, రైటర్స్ సేఫ్‌గార్డ్ క్యాష్ లాజిస్టిక్స్ కంపెనీకి చెందిన రెండు వాహనాల నుంచి 24 లక్షలా 28 వేలా 170 రూపాయల నగదును స్వాధీనం చేసుకొన్నారు. కూకట్‌పల్లిలో రూ.23 లక్షలా 05 వేలా 600, పేట్‌బషీరాబాద్‌లో రూ.1,22,570 చొప్పున నగదును ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సదరు నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతోపాటు ఎన్నికల నిబంధనలు పాటించకపోవడంతో డబ్బు సీజ్ చేశారు. కాగా.. నగదును ఎన్నికల కమిషన్ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకొన్న నగదు

ఇంజనీరింగ్ అధికారులపై జెడ్సీ ఆగ్రహం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి వాటి ప్రకారం నిధులు మంజురు చేయించుకొని అభివృద్ధి పనులు చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో కుత్బుల్లాపూర్ ప్రధాన రహదారికిరువైపులా 755 మీటర్లకు రూ.1.91 కోట్ల నిధులతో చేపట్టనున్న కూడలి విస్తరణ, అభివృద్ధి పనులు, గాజులరామారం సర్కిల్ పరిధిలోని రూ.1.27 కోట్ల నిధులతో చేపట్టనున్న షాపూర్‌నగర్ కూడలి, రూ.1.57 కోట్ల నిధులతో చేపట్టనున్న గాజులరామారం కూడలి విస్తరణ, అభివృద్ధి పనులను జెడ్సీ క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలో భాగంగా కుత్బుల్లాపూర్ కూడలి విస్తరణ వివరాలు తెలుసుకుంటూ ప్రధాన రహదారిలో సర్కిల్ కార్యాలయం నుంచి కుత్బుల్లాపూర్ గ్రామం వైపు 165 మీటర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పు రోడ్డు విస్తరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో అంత స్థలం అందుబాటులో ఉందా అని ప్రశ్నించారు. అనంతరం షాపూర్‌నగర్, గాజులరామారం కూడళ్లను జెడ్సీ పరిశీలించారు. ఆయా సర్కిళ్ల మంజూరు ప్లాన్‌ను సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు జెడ్సీ అడగగా ప్లాన్ తేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాన్ లేకుంటే ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. జంట సర్కిళ్ల ఇంజనీరింగ్ అధికారులు కూడళ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన పూర్తి వివరాలుతో సోమవారం సమావేశాన్నికి హాజరుకావాలని జెడ్సీ ఆదేశించారు. వారితో పాటు జంట సర్కిళ్ల ప్రట్టణ ప్రణాళికా, విద్యుత్, ఉద్యానవన అధికారులు రావాలన్నారు. కుత్బుల్లాపూర్ డీసీ నర్సింహ, ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈలు కృష్ణచైతన్య, కిష్టప్ప, డీఈలు పాపమ్మ, రూపాదేవి, ఏఈ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కుత్బుల్లాపూర్ ప్రధాన రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్

బీహెచ్‌ఈఎల్‌లో అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్

ఖెల్‌కాలనీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను, పెద్దలను ఆకట్టుకునే విధంగా బీహెచ్‌ఈఎల్ శివారు ప్రాంతంలో మొట్టమొదటి సారిగా అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎగ్జిబిషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నగరవాసులకు ముఖ్యంలో వేసవిలో చిన్నారులకు ఆహ్లాదానందించే విధంగా 60 రోజుల పాటు అండర్ వాటర్ టన్నెల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో ఆరు వందల రకాలకు పైగా చేపలు, స్టార్‌ఫిష్, గోల్డ్‌ఫిష్, ఎలక్ట్రిక్ ఈల్, అమెజాన్ అడవుల్లో మాత్రమే లభించే అలిగేటర్‌ఫిష్ వంటి ఎన్నో రకాల చేపలు, సముద్ర జీవాలు సందర్శకులకు మధురానుభూతిని అందిస్తాయని తెలిపారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, ఫడ్ కోర్టులు, దేశంలోని ఏర్పాటు చేశామని తెలిపారు.


ఎగ్జిబిషన్ వివరాలను తెలుపుతున్న నిర్వాహకులు


కమిషనర్ శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు, కాంగ్రెస్ నేతలు

మురుగు సమస్యను పరిష్కరించండి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి దుర్వాసనతో కాలనీలో ఉండలేకపోతున్నామని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫుడెన్షియల్ బ్యాంక్ కాలనీవాసులు కాంగ్రెస్ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కొంపల్లి నుంచి దూలపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వరద కాలువలో మురుగునీరు, గుర్రపుడెక్క పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. మురుగు కారణంగా దోమల సమస్య విపరీతంగా ఉందని, సాయంత్రం అయితే ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని తెలిపారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, జిమ్మి దేవేందర్, కావలి గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

భెల్ ఈడీ కేబీ రాజా

ఖెల్‌కాలనీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలోకి అడుగు పెట్టే ప్రతీ కార్మికుడు భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి, భద్రత పరికరాలను ధరించాలని భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ.రాజా పేర్కొన్నారు. ప్రపంచ భద్రతా దినోత్సవం సందర్భంగా శనివారం పరిశ్రమలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం చేసే ప్రతీ పనిలో భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. భెల్ యాజమాన్యం కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భద్రత అనేది కేవలం పరిశ్రమలో మాత్రమే కాకుండా అన్ని ప్రాంతాల్లో పాటించాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న పోటీని తట్టుకోవాలంటే నాణ్యతతో పాటు, భద్రతపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర భద్రత విభాగం- పరిశ్రమల సంయుక్త ఆధ్వర్యంలో చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదం జీవితాంత క్షోభించాల్సివస్తుందన్నారు. ప్రతీ ఒక్కరికి భద్రతపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలు సంభవించే సమయంలో అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈ అండ్ ఎస్‌డీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, సంగారెడ్డి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్ కుమార్, శ్రీవిద్య, భెల్ అధికార కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.


కార్యక్రమంలో భెల్ ఉన్నతాధికారులు, రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులు

చందానగర్ సర్కిల్‌లో ఓటర్‌స్లిప్‌ల పంపిణీ

చందానగర్,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో భాగంగా ఓటర్లకు ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం చందానగర్ సర్కిల్ పరిధిలో ప్రారంభమైంది. సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీల్లో బీఎల్‌ఓస్, మున్సిపల్ సిబ్బంది ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేశారు. చందానగర్‌లో పంపిణీ కార్యక్రమాన్ని ఉపకమిషనర్ వంశీకృష్ణ పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన సిబ్బందిని హెచ్చరించారు.


ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేస్తున్న సిబ్బంది


దాసరి నాగభూషణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సురవరం సుధాకర్‌రెడ్డి, చెన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు

సీఆర్ ఫౌండేషన్‌లో దాసరి నాగభూషణరావు వర్ధంతి

మియాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణరావు వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరావుతో కలిసి నాగభూషణరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసరి చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా పేద ప్రజల అభ్యున్నతికి, సీఆర్ ఫౌండేషన్‌కు చేసిన కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, రాజశేఖర్‌రెడ్డి, రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ రజనితో పాటు పలువురు పాల్గొన్నారు.

యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లిలోని బస్టాప్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. బస్సులు, ఆటోలు, సొంత వాహనాల్లో రాకపోకలు సాగించే వారికి మజ్జిగ అందించి దాహం తీర్చారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై రమేష్ హాజరై సంస్థ నిర్వాహకులను అభినందించారు. సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గోనిపూడి కృష్ణారావు, ఈశ్వర్, తారక్, సువర్చలాదేవి తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం


కొండాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మోదీ మూడోసారి ప్రధాని కావ డం ఖాయమని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కొండాపూర్, ఆదిత్యనగర్, శ్రీరాంనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్‌తో కలిసి ప్రచారం చేశారు. హఫీజ్‌పేట మార్తాండ్‌నగర్ విశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి హఫీజ్‌పేట, కొండాపూర్, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ పాల్గొన్నారు.

● కొండాపూర్‌లో ర్యాలీ

హైదరాబాద్ సిటీ: మైనార్టీల ఓటు బ్యాంకు అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండాపూర్ డివిజన్‌లోని మార్తాండ నగర్ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం రాత్రి పూజలు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో ప్రధాన మంత్రి ఎవరో చెప్పుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మార్తాండనగర్ ర్యాలీలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మద్యానికి బానిసై ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన బి. రమేష్(45) 20 సంవత్సరాల క్రితం కుటుంబసభ్యులతో బతుకుదెరువు కోసం వలస వచ్చి నగర శివారు ప్రాంతం కొంపల్లి మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటూ విచ్‌టచ్ స్టోన్స్ వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. అతడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కొద్ది రోజులుగా తాగుడుకు బానిస కావడంతో రమేష్‌ను పనిలోంచి యాజమాన్యం తొలిగించింది. దీంతో పనిలో నుంచి తొలగించారని మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు వచ్చి తలుపులు తట్టగా ఎంతకీ తీయకపోవడంలో కిటికీలోంచి చూడగా ఉరివేసుకొని కనిపించాడు. దీంతో చుట్టుప్రక్కల వారి సహాయంతో లోపలికి వెళ్లి చూసేసరికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కూకట్‌పల్లి, పేట్‌బషీరాబాద్, సూరారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): డీసీఎం వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన కూకట్‌పల్లిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో నివాసముండే ప్రశాంతి (37) కేపీహెచ్‌బీకాలనీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. శనివారం మధ్యాహ్నం బైకుపై ఆసుపత్రికి వెళ్తుండగా కూకట్‌పల్లి జాతీయ రహదారిలోని యూటర్న్ వద్ద డీసీఎం (ఏపీ29యూ2977) ఆమె ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రశాంతి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్, వాహనాన్ని అదుపులోకి తీసుకొన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు.


ప్రశాంతి (ఫైల్)

కరీంనగర్‌కు చెందిన యువకుడు..

పేట్‌బషీరాబాద్: కరీంనగర్ జిల్లా, నందిమేడారం గ్రామానికి చెందిన చొప్పరి విజయ్(23) బతుకుదెరువు కోసం కుత్బుల్లాపూర్ ఎంఎన్ రెడ్డినగర్‌లో నివాసం ఉంటూ జొమేటో డెలివరి బాయ్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బొల్లారంలో ఫుడ్ డెలివరీ చేసి బైక్‌పై కుత్బుల్లాపూర్‌కు వస్తుండగా మార్గమధ్యలోని ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108లో కొంపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అయితే అతడి పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు.

కౌడిపల్లికి చెందిన ఆటో డ్రైవర్

గాజులరామారం: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం, ముట్రోజ్‌పల్లి గ్రామానికి చెందిన పితాని ఆది(19) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో భార్యతో కలిసి ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. అతడి ఆటో చెడిపోవడంతో గాజులరామారంలోని మెకానిక్ షాపులో రిపేర్‌కిచ్చాడు. శనివారం తన ద్విచక్ర వాహనంపై గుమ్మడిదల దోమడుగు నుంచి గాజులరామారంలో ఆటో రిపేర్ షాపునకు వస్తుండగా జ్యోతి మిల్క్ కంపెనీ దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు గాయమై మృతి చెందాడు. ఆది మేనమామ సున్నం సంజీవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.